శబరిమల ఆలయాన్ని తలపించేలా!

- రూ. 5 కోట్లతో అయ్యప్పఆలయం నిర్మాణం
- జోరందుకున్న పనులు


కొనసాగుతున్న ఆలయ నిర్మాణ పనులు


మున్సిపల్ మైదానంలోని అయ్యప్ప ఆలయం (ఫైల్)

కడప కల్చరల్ : కడప నగరంలో స్వామి అయ్యప్పకు నూతన ఆలయం ఏర్పాటు చేసేందుకు పనులు ప్రారంభమయ్యాయి. కడప నగరంలో స్వామి అయ్యప్పకు తొలిసారిగా మున్సిపల్ మైదానంలో ఆలయం నిర్మించారు. ఇదే స్థానంలో శబరిగిరిలోని అయ్యప్ప ఆలయాన్ని తలపించేలా అదే నిర్మాణ శైలిలో నూతన ఆలయాన్ని నిర్మించేందుకు పనులు ప్రారంభం అయ్యాయి.

1997లో కేరళ నుంచి ఈ ప్రాంతానికి వచ్చిన అయ్యప్పస్వామి భక్తులు పీకే విశ్వనాథ గురుస్వామి కోరిక మేరకు స్థానిక ప్రముఖులు మున్సిపల్ మైదానంలో ఈ ఆలయాన్ని ఏర్పాటు చేశారు. తొలుత కొద్దిమంది భక్తులు వచ్చేవారు. క్రమంగా భక్తులు, దాతల సహకారంతో ఆలయం అభివృద్ధి చెందింది. దాదాపు పాతికేళ్లు కావడం, ఆధునిక వసతులు అవసరం కావడంతో కొందరు భక్తులు నూతన ఆలయ నిర్మాణం గురించి ప్రతిపాదన తెచ్చారు. ఆలయ నిర్వహణ కమిటీ అధ్యక్షుడిగా మేడా వెంకట శేషారెడ్డి, ఉపాధ్యక్షులుగా పోతుల వెంకట్రామిరెడ్డిలతో సభ్యులుగా శంకరయ్య, బాలకృష్ణ, భాస్కర్‌రెడ్డి, రాణా ప్రతాప్, రంగరాజు, కరుణాకర్‌రెడ్డి తదితరులతో నిర్మాణ కమిటీని ఏర్పాటు చేసుకున్నారు.

పనులు ప్రారంభం

2019లోనే నూతన ఆలయ నిర్మాణానికి ప్రయత్నాలు జరిగాయి. ఇంతలో కరోనా రావడం, పలు మార్పులు చోటుచేసుకోవడంతో మళ్లీ నూతన ఆలయ నిర్మాణం గురించి ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. అంచనా వ్యయం కూడా మారింది. ప్రస్తుతం శబరిమలలోని అయ్యప్ప ఆలయాన్ని పోలినట్లు సన్నిధాన దేవతల ఆలయాలను కూడా అదే ప్రాంగణంలో నిర్మించేందుకు మొత్తం రూ. 5 కోట్లకు పైగా అవసరమవుతుందని అంచనా వేశారు. తొలుత నిర్మాణ కమిటీ సభ్యులు తమవంతు విరాళం ప్రకటించారు. అనంతరం నగరంలోని అయ్యప్ప భక్తులు కూడా ఈ కార్యక్రమానికి సహకారం అందించగలమని హామీ ఇచ్చారు. ప్రధానంగా స్థానిక ధార్మికవేత్త, అయ్యప్ప భక్తుడు మేడా రఘునాథ రెడ్డి ఆలయ నిర్మాణంలో తమవంతు తోడ్పాటు అందించేందుకు ముందుకు వచ్చారు.

నెలరోజుల కిందట ఆలయ నిర్మాణంలో భాగంగా మూలమూర్తికి అదే ప్రాంగణంలో బాల ఆలయం నిర్మించారు. ఇటీవలే స్వామిని అందులో ప్రతిష్ఠించి నిర్మాణ పనులు ప్రారంభించారు. జిల్లాలో అచ్చం శబరిమల అయ్యప్ప ఆలయాన్ని తలపించేలా 18 మెట్లు, ఉప ఆలయాలతోసహా నిర్మించేందుకు పనులు జోరుగా సాగుతున్నాయి. రెండేళ్లలో పూర్తి చేయాలని నిర్వహణ కమిటీ సభ్యులు భావిస్తున్నారు.

19న గృహిణులకు వంటల పోటీలు

కడప రూరల్ : కల్లూరీస్ డయాబెటీస్ అండ్ ఒబెసిటీ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదిన గృహిణులకు చిరు ధాన్యాలతో వంట చేసే పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆ సొసైటీ అధ్యక్షులు కల్లూరి రఘురామిరెడ్డి తెలిపారు. శనివారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ 2023 సంవత్సరాన్ని చిరుధాన్యాల సంవత్సరంగా జరుపుకోవాలని ఐక్యరాజ్య సమితి, భారత ప్రభుత్వం సూచించినట్లు చెప్పారు. అందులో భాగంగా ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. వంట పోటీల్లో పాల్గొనదలిచిన వారు ఈనెల 17వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. నియమ నిబంధనల గురించి తమ సంస్థ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

నేడు గంగమ్మకు బోనాలు

కడప కల్చరల్ : కడప నగర పరిధిలోని పాలెంపల్లె వద్దగల రూకవానిపల్లెలో శనివారం శ్రీ గంగమ్మ తల్లి జాతరను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ జయభారత్‌రెడ్డి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. స్థానిక భక్తులు పెద్ద ఎత్తున హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. నిర్వాహకులు వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆదివారం ఉదయం 6.00 గంటల నుంచి అమ్మవారికి బోనాల సమర్పణ కార్యక్రమం నిర్వహించనున్నారు.

క్లుప్తంగా

రామాలయంలో విష్ణుసహస్ర నామ పారాయణం

కడప కల్చరల్ : కడప నగరం హౌసింగ్‌బోర్డు కాలనీలోని శ్రీ కోదండరామస్వామి ఆలయంలో శనివారం భక్తులు సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణం చేశారు. ఆలయ నిర్వాహకులు వెంకటరెడ్డి పర్యవేక్షణలో హాజరైన భక్తులు 11 మార్లు పారాయణం చేశారు. ప్రతినెల రెండో శనివారం ఈ కార్యక్రమాన్ని చేపడతామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేదికపై శ్రీ సీతారామలక్ష్మణులను కొలువు దీర్చి పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

గంగమ్మకు ప్రత్యేక పూజలు


విశేష అలంకారంలో అమ్మవారు

కడప కల్చరల్ : కడప నగరం మారుతినగర్‌లోని గ్రామ దేవత శ్రీ గంగమ్మ ఆలయ వార్షికోత్సవ సందర్భంగా శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారి మూలమూర్తికి పంచామృతాభిషేకం జరిపారు. ఈ సందర్భంగా సమీప వీధులకు చెందిన భక్తులు కుటుంబ సమేతంగా చల్లను మంగళ వాయిద్యాల మధ్య ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. ఆలయ ప్రాంగణంలోని పోతురాజు స్వామికి విశేష పూజలు చేశారు. ఆలయ నిర్వాహకుడు చామంచి వెంకట సుబ్బయ్య ఆధ్వర్యంలో విరాట్ అమ్మవారి మూల విగ్రహం వద్ద ప్రత్యేకంగా జ్యోతులతో అలంకారం చేశారు. స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో కార్యక్రమానికి హాజరై అమ్మవారికి పూజలు జరిపారు. ఆదివారం బోనాల పండుగ నిర్వహించనున్నారు.

ఘనంగా కడప రాయుని గ్రామోత్సవం


ప్రత్యేక అలంకరణలో స్వామి,అమ్మవార్లు


కడప కల్చరల్ : తిరుమలకు తొలిగడపగా భావిస్తున్న దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి గ్రామోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ మాసోత్సవాల్లో భాగంగా రెండో శనివారాన్ని పురస్కరించుకుని తొలుత మూలమూర్తికి, అనంతరం ఉత్సవమూర్తులకు అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులను పలు రకాల పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పల్లకీపై కొలువుదీర్చారు. భక్తుల జయజయధ్వానాల మధ్య పల్లకీ దేవుని కడప మాడవీధుల్లో సాగింది. గ్రామస్తులు తమ వీధికి తరలివచ్చిన స్వామివారిని దర్శించుకున్నారు. అర్చకులు వారికి హారతులు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అర్చకులు త్రివిక్రమ్ ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇతర కార్యక్రమాలు నిర్వహించారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్


నిందితుడి అరెస్ట్ వివరాలను తెలియజేస్తున్న చిన్నచౌక్ సీఐ శ్రీరామ్ శ్రీనివాసులు

కడప అర్బన్ : కడపలోని మానస నర్సింగ్ హోం వీధిలో షేక్ మహమ్మద్ హబీబుల్లా నివాసం ఉంటున్నాడు. శనివారం కొండాయపల్లె కాల్వకట్ట వద్ద అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా సీఐ శ్రీరామ్ శ్రీనివాసులు ఆదేశాల మేరకు ఎస్‌ఐ అమర్‌నాథ్‌రెడ్డి, తమ సిబ్బందితో కలిసి అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 18 క్వార్టర్ బాటిళ్ల మద్యం సీజ్ చేశారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న వన్‌టౌన్ ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి

కడప అర్బన్ : కడప రాజారెడ్డి వీధిలోని ఎస్పీ బంగ్లా సమీపంలో శనివారం సాయంత్రం రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలనీ వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ హెల్మెట్, సీటు బెల్ట్ ధరించాలని సూచించారు. మద్యం తాగి వాహనాలను నడపవద్దన్నారు. డ్రైవింగ్‌లో సెల్‌ఫోన్ మాట్లాడటం ప్రమాదకరమనీ ఎస్‌ఐ హెచ్చరించారు.

యువగళం కాదు.. అసత్య గళం

సీకేదిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీకేదిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి

కడప కార్పొరేషన్ : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పేరుతో చేపట్టిన పాదయాత్ర లో అన్ని అసత్యాలే మాట్లాడుతున్నారని సీకేదిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజుల రెడ్డి ధ్వజమెత్తారు. శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ లోకేష్ ప్రధానంగా పరిశ్రమలు, మహిళలు, ముస్లింల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఏమీ చేయడంలేదని మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి లక్షా నలభై వేలమందికి ఉద్యోగాలు ఇచ్చారన్నారు. అలాగే 411 ఎస్‌ఐ పోస్టులు, తదితర పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేశారన్నారు. వైద్య శాఖలో 48 వేల మందికి ఉద్యోగాలు, స్కిల్ డెవెలప్‌మెంట్ ద్వారా శిక్షణ ఇస్తున్నారని తెలిపారు. ఇలా సుమారు 3 లక్షల ఉద్యోగాలు ఇచ్చిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. బాబు వస్తే జాబు వస్తుందనే నినాదంతో 2014 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన టీడీపీ కేవలం 34 వేల మందికే ఉద్యోగాలు ఇచ్చారన్నారు. విశాఖపట్నంలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో 375 మందితో రూ.13 లక్షల కోట్ల ఎంఓయూలను కుదుర్చు కున్నారని తెలిపారు. రిలయన్స్ అంబానీ తదితర బడా పారిశ్రామిక వేత్తలు ఆంధ్ర రాష్ట్రంలో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, ప్రొటెన్షియల్ ఉందని కొనియాడారన్నారు. సమ్మిట్ కారణంగా పరిశ్రమలు వస్తే 13 లక్షల మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ బాలయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు ఐస్ క్రీం రవి, సుబ్బరాయుడు, క్రిష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ధ్వజస్తంభ స్థాపన

వేంపల్లె : స్థానిక కడప–పులివెందుల బైపాస్ రోడ్డులో నూతనంగా నిర్మించిన అయ్యప్పస్వామి ఆలయంలో శనివారం ధ్వజస్తంభ స్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ నరసింహారెడ్డి అధ్యక్షతన అర్చకులు ఎస్.ప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో ధ్వజస్తంభాన్ని నిలబెట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు. నేడు ఆదివారం అయ్యప్పస్వామి నూతన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

సిద్దవటం : మండలంలోని మూలపల్లె గ్రామం వద్ద శనివారం 692 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తులసీ నాగప్రసాద్ తెలిపారు. మూలపల్లె గ్రామంలో అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారని సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడులు చేశామని ఆయన పేర్కొన్నారు. 692 బస్తాల రేషన్ బియ్యం, తరలిస్తున్న జీపు స్వాధీనం చేసుకుని, ఐదుగురిని అరెస్టు చేశామని చెప్పారు. బియ్యంను తహసీల్దారుకు అప్పగిస్తామని వివరించారు.

• వర్షంనీరు కాదది.. మురుగునీరు



కడప నగరంలోని ఆర్టీసీ బస్టాండు ఔట్ గేట్ సమీపంలో భూగర్భ డ్రైనేజీ నుంచి వచ్చిన మురుగునీరు, కాలువల్లోంచి వచ్చిన నీరు కలగలిసి రహదారిపై నిలిచిపోయాయి. దుర్వాసన వెదజల్లుతున్న ఆ నీటిలో రాకపోకలు సాగించడానికి వాహనచోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ నీటిని బయటకి పంపేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు ప్రయాణికులు కోరారు. – కడప కార్పొరేషన్

విద్యార్థుల భవిష్యత్తుకు బంగారుబాట వేయండి


మాట్లాడుతున్న ఎంఈఓ పాలెం నారాయణ

కడప ఎడ్యుకేషన్ : ఉపాధ్యాయులు, తల్లితండ్రులు కలిసి విద్యార్థుల భవిషత్తుకు బంగారుబాట వేయాలని ఎంఈఓ పాలెం నారాయణ అన్నారు. కడప నగరపాలక మెయిన్ పాఠశాలలో హెచ్ఎం నాగమణి ఆధ్వర్యంలో ఎస్ఎస్‌సీ విద్యార్థుల తల్లితండ్రుల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది పరీక్షలకు కేవలం 20 రోజులు మాత్రమే గడువుందని, తల్లితండ్రులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి చదువును, ఆరోగ్యాన్ని పర్యవేక్షించాలని సూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రత్యేక ప్రణాళికకు అనుగుణంగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో సీఆర్పీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి


ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డికి వినతిపత్రాన్ని సమర్పిస్తున్న పెన్షనర్ల సంఘం నాయకులు

కడప ఎడ్యుకేషన్ : పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పెన్షనర్ల సంఘం నాయకులు కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డిని కోరారు. ఈ విషయమై శనివారం ఎమ్మెల్యేను కడపలో కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. స్పందించిన ఎమ్మెల్యే రాబోయే శాసనసభ సమావేశాల్లో ప్రభుత్వానికి విన్నవించి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం జిల్లా కార్యదర్శి రామ్మూర్తినాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగమునిరెడ్డి, కార్య నిర్వాహక కార్యదర్శి బాలయల్లారెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్ రాధాకృష్ణ, సత్యారాజు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణా ఫలాలను అందరికీ అందించాలి


మాట్లాడుతున్న విద్యాశాఖ రాష్ట్ర రిసోర్సు పర్సన్ గునిశెట్టి శ్రీనివాసులు

కడప ఎడ్యుకేషన్ : విద్యార్థులను సమాజంలో ఉత్తమ పౌరులుగా తయారు చేయాలంటే శిక్షణలో పొందిన ఫలాలను వారికి అందించినప్పుడే సాధ్యమౌతుందని విద్యాశాఖ రాష్ట్ర రిసోర్సు పర్సన్, ఏకలవ్య విద్యా కమిటీ సలహాదారు గునిశెట్టి శ్రీనివాసులు పేర్కొన్నారు. ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో కడప బాలాజీనగర్ నెహ్రూ యువకేంద్ర కార్యాలయంలో శనివారం అక్షయ విద్యాకేంద్రాల ట్యూటర్లకు ఒక రోజు పునశ్చరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణలో పొందిన ఫలాలు, నైపుణ్యాలను అందరికీ అందించాలన్నారు. కార్యక్రమంలో ఏకలవ్య ఫౌండేషన్ ట్రస్టు ప్రతినిధి చలపతి, విద్యా కమిటి అధ్యక్షురాలు బాలకృష్ణ, కోఆర్డినేటర్ నరేష్‌కుమార్, గిరిరాజు, అకౌంటెట్స్, కేంద్రాల నిర్వాహకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవం.. ప్రసన్న విఘ్నేశ్వర కల్యాణం


స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

కడప కల్చరల్ : కడప నగరం బెల్లమండివీధిలోని శ్రీ ప్రసన్న విఘ్నేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీ సిద్ధి బుద్ధి అమ్మవార్ల సమేతంగా తిరు కల్యాణ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ త్రి పుష్కర సహిత అష్టబంధన మహా కుంబాభిషేకం సందర్భంగా ఈనెల 8 నుంచి కార్యక్రమాలు జరుగుతున్నాయి. తొలుత మూలవర్లకు అభిషేకం జరిపారు. ప్రాతఃకాల పూజ, హోమం, మహాపూర్ణాహుతి, కలశోద్వాసన, అష్టబంధన సమర్పణ, మహాకుంభాభిషేకం, ప్రథమ దర్శన ఘట్టం నిర్వహించారు. అనంతరం వధూవరులుగా అలంకరించిన ఉత్సవ మూర్తులను కల్యాణ వేదికపై ఏర్పాటు చేసి అర్చకులు చంద్రమౌళిశర్మ బృందం కల్యాణ క్రతువును నిర్వహించిది. రాత్రి పల్లకిపై వధూవరులైన దేవతామూర్తులను కొలువుదీర్చి అట్టహాసంగా నగరోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులందరికీ అన్నదానం ఏర్పాటు చేశారు. ఆదివారం సాయంత్రం ఉత్సవాల ముగింపు సందర్భంగా పుష్కయాగం నిర్వహిస్తారు.


కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

మా తెలుగు తల్లికి మొల్లపూదండ

రేపు మొల్లమాంబ జయంతి


కడప కోటిరెడ్డిసర్కిల్‌లోని మొల్లమాంబ విగ్రహం


బ్రౌన్ గ్రంథాలయంలో గల మొల్ల రామాయణ తాళపత్ర గ్రంథం

కడప కల్చరల్ : కవుల గడపగా పేరున్న మన జిల్లా ముద్దుబిడ్డ మొల్లమాంబ. సాహిత్య పరంగా ఔన్నత్యాన్ని పెంచిన మన ఆడబిడ్డ కులమతాల అసమానతలు రాజ్యమేలుతున్న ఆనాడే తన సాహితీ ప్రతిభతో ఆ కష్టాలను అధిగమించి ధీశాలిగా నిలిచింది. తెలుగు రామాయణ రచనతో తెలుగు సాహిత్య లోకంలో తనదైన ప్రత్యేక స్థానం సాధించుకున్నారు. ఇలాంటి మహిళా మణిని కన్నందుకు జిల్లా గర్విస్తోంది. సోమవారం మొల్లమాంబ జయంతి. ఈ సందర్భంగా ఆమె గురించిన ప్రత్యేక కథనం.

తెలుగు సాహితీవనంలో విరబూసిన మల్లెపువ్వు మొల్లమాంబ. సాంఘిక దురాచారాలు, కులం కట్టుబాట్లు రాజ్యమేలుతుండిన ఆనాడే ఒక యువతి, అందునా వెనుకబడిన కులానికి చెందిన వ్యక్తి తెలుగు జాతి గర్వించేలా ‘రామాయణ’ కావ్యాన్ని అద్భుతంగా రాయడం విశేషం. ఇందులో తన ప్రతిభ ఏమి లేదని..అంతా శ్రీకంఠ మల్లేశ్వరుడు, శ్రీరామచంద్రుడి దయ మాత్రమేనని వినయం ప్రకటించారు. తెలుగు తల్లికి ‘మొల్ల’పూదండ అలంకరించిన తెలుగు తెలుగు రామాయణకర్త మొల్లమాంబ. జిల్లాలో తొలి తెలుగు కవయిత్రిగా అన్నమాచార్యుల సతీమణి తాళ్లపాక తిమ్మక్కకు ఖ్యాతి ఉంది. తర్వాత ఆ స్థాయిలో తెలుగు భాషలో అద్భుతమైన కావ్యాన్ని రచించిన కీర్తి మొల్లమాంబకే దక్కింది.

గోపవరంలో....

చరిత్రకారులు, పరిశోధకుల సమాచారం మేరకు మొల్లమ్మ జిల్లాలోని బద్వేలు వద్దగల గోపవరం గ్రామంలో జన్మించారు. కుమ్మరి (శాలివాహన) కులంలో పుట్టి సంఘం కట్టుబాట్ల పేరిట వివక్షను ఎదుర్కొన్న ఆమె తన రామాయణ రచనతో నాటి మహా పండితులు, విమర్శకుల ప్రశంసలు పొందారు. ఆమె జన్మస్థలి గురించి భిన్నమైన వాదనలు ఉన్నా పరిశోధకులు ఇటీవల ఆమె వైఎస్సార్ జిల్లాకు చెందిన వారేనని, బద్వేలువద్దగల గోపవరమే ఆమె జన్మస్థానమని బలమైన ఆధారాలు చూపారు.

మొల్లమాంబ ఇంటి పేరుగా గల ఆతుకూరు (ఆత్మకూరు) ప్రస్తుతం నెల్లూరు జిల్లాలో ఉన్నా విభజనకు ముందు అది మన జిల్లాలో ఉండేదని పరిశోధకులు తెలుపుతున్నారు. రామాయణ కావ్య రచన సమయంలో మొల్లమాంబ కూర్చొన్న బండ గ్రామంలో ఆమె పూజించిన శ్రీ కంఠ మల్లేశ్వరుని ఆలయం గోపవరంలోనే ఉండడంతో నివాస స్థలంపై విమర్శలకు తెర పడింది. మొల్లమ్మ పుట్టుకతోనే తల్లిని కోల్పోయారు. తండ్రి కేశనశెట్టి చిన్న సైనికాధికారి. ఆమెను మేనమామ కుమారుడికి ఇచ్చి వివాహం చేయాలని భావించి నిశ్చితార్థం కూడా చేశారు. ఆ దశలో ఆ యువకుడు యుద్ధంలో మరణించగా మనస్తాపానికి గురైన మొల్లమ్మ ఇక తనకు పెళ్లే వద్దన్నది. తండ్రి ఆమె నిర్ణయాన్ని గౌరవించి చదువుకునే అవకాశం కల్పించారు. మొల్లమ్మ రామాయణ, భారత, భాగవతాది గ్రంథాలను అధ్యయనం చేసింది. ఆ క్రమంలో రామాయణంపై మక్కువ ఏర్పడడంతోపాటు పద్య రచన అలవడింది. శైవ ప్రాచుర్యంలో ఉన్న ఆ రోజుల్లో తండ్రి ఆమెకు శివ దీక్షనిచ్చారు. శైవం, వైష్ణవం మధ్య తీవ్ర పోరు గల ఆరోజుల్లోనే ఆమె శైవాన్ని అనుసరిస్తూనే రామాయణ రచన చేయడమే గాక ఆకావ్యాన్ని శ్రీరామచంద్రునికే అంకితం ఇచ్చింది.

రామాయణ పరిమళం

మొల్లమ్మ రాసిన రామాయణానికి ఖ్యాతి లభించింది. వాల్మీకి సంస్కృతంలో 24 వేల శ్లోకాలతో రాసిన రామాయణాన్ని ఆమె కేవలం 871 పద్య గద్యాలతోనే రచించి తన సాహితీ ప్రతిభను ప్రపంచానికి చాటారు. పాత్రల చిత్రణలో కూడా తనదైన శైలి చూపారు. ఎంతో సహజంగా అనిపించే ‘గుహుడు’ పాత్రను చమత్కారంతో నింపి పండితులు, పామరుల ప్రశంసలందుకున్నారు.

వీరభక్తుని కృషి

మొల్లమాంబ పేరు వినిపించానే విద్వాన్ గానుగపెంట హనుమంతరావు గుర్తుకు వస్తారు. ఆమె జన్మస్థలి బద్వేలు గోపవరంలో ఆమె ఉపయోగించిన వస్తువులు, పూజలు చేసే ఆలయం, నివసించిన కుటీరం తదితరాల గురించి విశేషంగా వెలుగులోకి తేవడమే కాకుండా వాటిని రక్షించాలని కోరుతున్నారు. డాక్టర్ వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కోట్లాది రూపాయలతో బద్వేలు సమీంలోని మెయిన్‌రోడ్డులో ఆమె పేరిట హరిత పర్యాటక హోటల్ నిర్మింపజేసి ఆవరణలో మొల్లమాంబ విగ్రహం ఏర్పాటు చేశారు. యేటా మహిళా దినోత్సవం నుంచి మొల్లమాంబ జయంతి వరకు ఏడురోజులపాటు జిల్లా నలుమూలల మొల్ల సాహితీ ఉత్సవాలను ఏర్పాటు చేస్తూ ఆమె కీర్తిని ఇనుమడింపజేస్తున్నారు.

న్యాయస్థానం ఉత్తర్వుల ప్రకారం పునరావాసం కల్పించండి


సీపీఓ వెంకటరమణకు వినతిపత్రం అందజేస్తున్న అగ్రహారం గ్రామస్తులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

ఓబులవారిపల్లె : న్యాయస్థానం ఉత్తర్వుల ప్రకారం మంగంపేట అగ్రహారం ఆర్‌ఆర్–2 గ్రామానికి పునరావాసం కల్పించాలని గ్రామస్తులు ఏపీఎండీసీ కార్యాలయంలో సీపీఓ వెంకటరమణకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు గుత్తిరెడ్డి హరినాథ్‌రెడ్డి మాట్లాడుతూ మంగంపేట అగ్రహారం గ్రామానికి గతంలో గ్రామాన్ని తరలించి ఎక్స్‌గ్రేషియా మాత్రమే ఇచ్చారని, ఆర్‌ఆర్ చట్టం ప్రకారం పునరావాసం కల్పించాలని, ప్రస్తుతం న్యాయస్థానం ఉత్తర్వుల ప్రకారం ఏపీఎండీసీ అధికారులు గ్రామస్తులకు మెరుగైన పునరావాసం కల్పించి, పరిహారం అందించాలన్నారు. ఆరు నెలలు లోపు గ్రామస్తులకు పరిహారంతోపాటు పునరావాసం కల్పించి గ్రామస్తులు కోరుకున్న ప్రదేశాలలో స్థలం కేటాయించి ఇంటి పట్టాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి, సీనియర్ నాయకులు కొలూరు నారాయణరెడ్డి, తల్లెం రమణారెడ్డి, రైల్వేకోడూరు మార్కెట్ యార్డు డైరెక్టర్ వడ్డి సుబ్బారెడ్డి, పీ లక్ష్మీనారాయణ, మాజీ ఎంపీటీసీ సుబ్రమణ్యం, మైనార్టీ నాయకులు కరిముల్లా, సర్పంచ్ మినుగు సుధాకర్, ఎంపీటీసీ హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

పునరావాసం కోసం ఎండీతో చర్చలకు రండి

మంగంపేట, కాపుపల్లి, దళితవాడ, అరుంధతివాడ మూడు గ్రామాల తరలింపు విషయంపై ఏపీఎండీసీ ఎండీ విజీ వెంకటరెడ్డితో చర్చలకు రావాలని గ్రామస్తులను సీపీఓ వెంకటరమణ కోరారు. మూడు గ్రామాల పునరావాస కల్పనకు శనివారం ఏపీఎండీసీ కార్యాలయం ఎదుట గ్రామస్తులు రెండో రోజు నిరసన చేపట్టారు. పునరావాస కల్పనలో జాప్యం జరుగుతోందని, రెవెన్యూ పరంగా అన్ని విధాలా సహకరించిన గ్రామాలకు పరిహారం, పునరావాసం కల్పించడంలో ఏపీఎండీసీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని గ్రామస్తులు, పులపుత్తూరు రామసుబ్బారెడ్డి అన్నారు. ఇందుకు సీపీఓ మాట్లాడుతూ గ్రామస్తుల సమస్యలను ఎండీ వీజీ వెంకటరెడ్డి దృష్టికి తీసుకువెళ్లామని తెలిపారు. గ్రామస్తులకు పెన్షన్లు, హెల్త్ కార్డులు వెంటనే అందజేసేందుకు ఆయన ఆదేశించారని పేర్కొన్నారు. ఉద్యోగాలు, పునరావాసం, పరిహారం విషయంపై బుధవారం గ్రామ ప్రతినిధులు, గ్రామస్తులు విజయవాడ ఏపీఎండీసీ కార్యాలయానికి వచ్చి చర్చించాలని, రెండు నెలల కాల వ్యవధిలో అన్ని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన తెలిపారన్నారు. ఇందుకు గ్రామస్తులు సమ్మతించి నిరసన విరమించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శంకరయ్య, పులపుత్తూరు సుదర్శన్‌రెడ్డి, కోటి, మూడు గ్రామాల ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

భర్తతోపాటు బంధువులపై కేసు నమోదు

కడప అర్బన్ : కడప తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలోని రవీంద్రనగర్‌కు చెందిన సునీత అనే మహిళకు, తిరుపతికి చెందిన మునిచంద్రారెడ్డికి వివాహమైంది. వారి మధ్య మనస్పర్థలు ఏర్పడటంతో తనను వేధిస్తున్నాడనిని ఆయన భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమేరకు భర్తతోపాటు, మరికొందరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఉలసయ్య తెలియజేశారు.